క్లుప్తంగా

మాదిగలకు రిజర్వేషన్ కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ సొసైటీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీ చేసేందుకు మాదిగలకు కూడా వాటా ప్రకటించి, రిజర్వేషన్ కల్పించాలని జెన్‌కో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి, మాదిగ జేఏసీ ఉద్యోగుల జాయింట్ సెక్రటరీ తిప్పారపు రమేశ్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ డేలో జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందించారు. ఉలవులపూడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాలన సులభం

పాల్వంచరూరల్: నూతన గ్రామ పంచాయతీల ద్వారా పాలన సులభతరం అవుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని బిక్కుతండాలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడం కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, అబ్దుల్ రహీం, రామకృష్ణ, చేన్నకేశవరావు, సాబీర్‌పాషా, విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, ముత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు

పాల్వంచ: శేఖరంబంజరలో ఆదివారం రాత్రి తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు మహిళలు వేర్వేరు అంశాలతో పూజలు చేశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బాలునాయక్, స్వరాజ్, ఎస్‌ఎ.జలీల్, వై.వెంకటేశ్వరరావు, రాంచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

14న ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల సాధనకు ఈ నెల 14న ఏరియా జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. సోమవారం ఏరియా వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 9 నెలలు కార్మికులు జీతాలు నష్టపోయి.. హయ్యర్ రిఫరల్ కోసం ఎదురుచూసిన కార్మికలను అన్‌ఫిట్ చేయకపోవడం బాధాకరమని, గతంలో ఇలాంటి బోర్డ్‌ను ఎప్పుడూ చూడలేదని తెలిపారు.

జీవితకాల పెన్షన్ అందజేత

జూలూరుపాడు: రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుండెపుడి గ్రామవాసి మునగాల సాయికిరణ్‌కు జీవిత కాలం పెన్షన్‌ను ఆర్యవైశ్య మహాసభ మాజీ జిల్లా అధ్యక్షుడు, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చారుగుళ్ల శ్రీనివాస్ అందజేస్తున్నారు. సోమవారం ఆగస్టుకు సంబంధించిన పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో ఉడతా వెంకటేశ్వర్లు, వేణుగోపాల్‌రావు, సత్యనారాయణ, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, జనార్దన్, వెంకటేశ్వరరావు, వినయ్‌కుమార్, నుదురుపాటి ప్రేమ్‌కిషోర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అరెస్టుపై నిరసన

జూలూరుపాడు: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీలను ఢిల్లీలో అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడులో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ధర్నాతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్‌నాయక్, మధుసూదన్‌రావు, నరసింహారావు, లచ్చునాయక్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, నాగేశ్వరరావు, రఘు, కృష్ణ, పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు అన్యాయం

ఇల్లెందు: త్వరలో ఎన్నికలు జరుగబోతున్న బిహార్‌లో భారీగా ఓట్లు తొలగించారని, ఈ పద్ధతి దుర్మార్గమని సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ ఆరోపించారు. సోమవారం ఇల్లెందులో సీపీఎం ఆధ్వర్యంలో ఓట్ల తొలగింపును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆలేటి కిరణ్, టి.కృష్ణ, మోహన్‌రావు, నాగరాజు, మహమూద్, రాము, లక్ష్మణ్, శ్రీను, వజ్జ సురేశ్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని అధికారులు, వివిధ యూనియన్ ప్రతినిధులతో మల్టీ టీమ్ నిర్వహణపై సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు జీఎం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, రజాక్, గట్టయ్య, సూర్యనారాయణ రాజు, సుమలత, రామకృష్ణ, మోహన్‌రావు, రామ్‌బరోస్ మహతో, రమేశ్ పాల్గొన్నారు.

నిఘా కరువై..



రామవరం ఎస్‌సీబీనగర్ సెంటర్లో పనిచేయని సీసీ కెమెరాలు (సర్కిల్‌లో)

- రామవరం టూ రుద్రంపూర్ వరకు కానరాని సీసీ కెమెరాలు
- కష్టంగా మారిన ప్రమాదాలు, దొంగతనాల నిందితుల గుర్తింపు
- కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నా అలంకారప్రాయమే..
- ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలంటున్న ప్రజలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో రోడ్లన్నీ వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగానే ఉంటాయి. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అలాగే, చోరీలు కూడా ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో నిందితులను గుర్తించేందుకు కీలకంగా పనిచేసే సీసీ కెమెరాలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నవారిని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో గుర్తించలేకపోతున్నట్లు సమాచారం. నగరంలోని రామవరం టూ రుద్రంపూర్, పెనగడప వరకు సీసీ కెమెరాలు అక్కడక్కడా ఏర్పాటు చేసినా అవి అలంకారప్రాయంగా మిగిలాయి. కొన్నిచోట్ల అసలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. రామవరం ఎస్‌సీబీనగర్ నుంచి రామవరం, రుద్రంపూర్, పెనగడప వరకు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. రాత్రి వాహనాల రాకపోకల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ మార్గంలో యాక్సిడెంట్లు జరిగి వాహనదారులు మరణించిన ఘటనలు చాలా ఉన్నాయి. ఆ సమయంలో రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం కష్టతరంగా మారుతోంది. రద్దీ ప్రాంతాలు, మార్కెట్లలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు, అధికారులు అవగాహన కల్పించినా కార్యరూపం దాల్చలేదు.

సీసీ కెమెరాలు పనిచేయక..

రామవరం, రుద్రంపూర్, త్రీఇంక్‌లైన్, ఫోర్ ఇంక్‌లైన్, గౌతంపూర్, రామవరం మార్కెట్ ఏరియా, క్లబ్ ఏరియా, సీఆర్‌పీ క్యాంప్, వనందాస్‌గడ్డబస్తీ, పెనగడప వంటి ప్రాంతాల్లో సింగరేణి ఉద్యోగులు, ప్రైవేట్, ప్రభుత్వ, ఉద్యోగులు నివాసం ఉంటారు. ఆయా ప్రాంతాల్లో సొత్తు, ద్విచక్రవాహనాల చోరీలు చాలా జరిగాయి. ఎస్‌సీబీనగర్‌లోని బ్రిడ్జి సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న దుకాణంలో దొంగలు పడి తులం బంగారంతో పాటు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. మరో దుకాణంలో రూ.10 వేల నగదును దోచుకున్నారు. ఆ ప్రాంతంలో బ్రిడ్జికి సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడంతో నిందితులను ఇప్పటివరకు గుర్తించలేక పోయారు. రుద్రంపూర్ ప్రాంతంలో ఆరు నెలల కిందట ఓ ఇంట్లో 2 తులాల బంగారం ఎత్తికెళ్లిన ఘటనలో సైతం దొంగలు దొరకలేదు. జాతీయ రహదారి మీదుగా రుద్రంపూర్ ఏరియాలోని దస్‌బాద్‌వద్ద రామవరం వస్తున్న క్రమంలో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడి మరణించాడు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



రామవరం నుంచి రుద్రంపూర్, పెనగడప వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గాను ప్రణాళికలు రూపొందిస్తాం. అధికారులు, ప్రజల సహాయ సహకారాలు తీసుకుంటాం. ప్రతి వ్యాపారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయి.

–డి.ప్రతాప్, సీఐ, టూటౌన్

అవగాహన కల్పించాలి..



రామవరం నుంచి రుద్రంపూర్, పెనగడప వరకు సీసీ కెమెరాలు లేవు. ఉన్నా పని చేయవు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినా, ఆయా ప్రాంతల్లో దొంగతనాలు జరిగినా నిందితుల గుర్తింపునకు అవకాశం ఉంటుంది. సీసీ కెమెరాల ఏర్పాటుపై ఇప్పటికైనా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. చోరీలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి.

–రమేశ్, న్యాయవాది, పంజాబ్‌గడ్డబస్తీ

పని చేయడం లేదు..



రామవరం ఎస్‌సీబీనగర్‌లో గతంలో రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. బ్రిడ్జి సమీపంలో చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయడం లేదు. రాత్రిళ్లు ఇక్కడ ఆకతాయిలు తాగి గొడవలు చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉంటే నిందితులను పట్టుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

–మంగీలాల్, ఎస్‌సీబీనగర్, రామవరం

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తాం



యూరియా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లెందురూరల్: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.37 కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పథకానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. గతంలో పలు గ్రామాల్లో అవసరమం మేర వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టకపోవడం, పైపులు పూర్తిస్థాయిలో వేయకపోవడం వంటి కారణాలతో నీటి సరఫరా ఇబ్బందిగా మారిందన్నారు. గత వేసవిలో పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని గుర్తించి పైపులైన్లు వేశామని చెప్పారు. వాటర్ ట్యాంకుల అవసరాన్ని కూడా గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.1.37 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని కొమరారం హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో బానోత్ రాంబాబు, మెట్ల కృష్ణ, పద్మావతి, బాలాజీ, పులి సైదులు, మండల రాము, మహేశ్, అలెం కిరణ్, పూనెం సురేందర్, నాలవెల్లి నర్సింహారావు, భార్గవ్, ధనుంజయ్, నాగార్జున్, కల్తి పద్మ, మోకాళ్ల వెంకటమ్మ, పాయం లలిత పాల్గొన్నారు.

యూరియా విక్రయ కేంద్రం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ కేంద్రంగా యూరియా విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. 'యూరియా విక్రయ కేంద్రం ప్రారంభమెప్పుడో' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి పీఏసీఎస్ అధికారులు స్పందించారు. విక్రయ కేంద్రంలో నిల్వ ఉన్న 200 బస్తాలను సోమవారం రైతులకు విక్రయించారు. ఆన్‌లైన్‌లో నమోదుకు సాంకేతిక సమస్య ఉత్పన్నమైనా ఆధార్‌కార్డులు, పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను స్వీకరించి తొలి రోజు విక్రయాలు చేపట్టారు. కార్యక్రమంలో మెట్ల కృష్ణ, హీరాలాల్, సైదులు, రాము, సురేందర్, కృష్ణ, భిక్షం, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర ప్రదర్శన

సుజాతనగర్: నానో యూరియా వాడకంపై సుజాతనగర్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ జి.నర్మద మాట్లాడుతూ.. సాధారణ యూరియాలో నత్రజని వినియోగ సామర్థ్యం 30 నుంచి 40 శాతం వరకు ఉంటుందని, నానో యూరియా పిచికారీ చేయడంతో 80 నుంచి 85 శాతం వరకు నత్రజని వినియోగ సామర్థ్యం ఉంటుందని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీని కొన్ని రకాల పురుగుమందులతో కూడా కలిపి పిచికారీ చేసుకోవచ్చని, దీంతో ఖర్చు కూడా ఆదా అవుతుందని వెల్లడించారు. ఏఈఓ శరత్, రైతులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు..

టేకులపల్లి: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి కేంద్రంలోని నరేంద్ర మోదీ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాడని సంయుక్త కిసాన్ మోర్చా జేఏసీ నాయకులు దుబాకుల ప్రసాద్ (ఐఎఫ్‌టీయూ), భూక్య హర్ష, ఎట్టి నరసింహారావు (ఏఐకేఎంఎస్), గుగులోతు రామచందర్ (రైతు సంఘం), కడుదుల వీరన్న (వ్యవసాయ కార్మిక సంఘం) విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 13న నిర్వహించే ర్యాలీలు, సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కల్తి వెంకటేశ్వర్లు, ఈసం నరసింహారావు, ఆయిత శ్రీరాములు, పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ సమావేశాలు



వివరాలు వెల్లడిస్తున్న జీఎం వీసం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణిలో ఆయా గనులవారీగా మల్టీలెవల్ డిపార్ట్‌మెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి అందరికీ అన్ని శాఖల పనితీరు, ఉత్పత్తి, సంస్థ పనితీరు, లాభాలు, నష్టాలు వివరించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. తొలుత జేకేఓసీలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశామని, అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి, కేఓసీ పీఓ గోవిందరావు, డీజీఎం పర్సనల్ తుకారం, అధికారులు గిరిధర్‌రావు, మధుబాబు, రవికుమార్, సుధాకర్, రాందాస్ తదితరులు ఉన్నారు.

మార్పుల కోసం నేడు దరఖాస్తుల స్వీకరణ

సుజాతనగర్: రైతు బీమా పథకానికి గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో ఆధార్, నామినీలో ఏవైనా మార్పులు చేసుకోవాలనుకుంటే మంగళవారం 12వ తేదీలోగా వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఏఓ జి.నర్మద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025, జూన్ 5 నాటికి కొత్త పట్టాదారు పుస్తకం పొందిన రైతులు ఆగస్టు 13వ తేదీ లోగా రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'పదేళ్లు కార్మికులను మోసం చేశారు'



మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులను కల్వకుంట్ల కవిత పదేళ్లు మోసం చేశారని, మళ్లీ ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేసేందుకు వస్తోందని ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కార్యాలయంలో జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి సింగరేణి గుర్తింపు సంఘం గౌరవాధ్యక్షురాలిగా వ్యవహరించిన కవిత సింగరేణిని దోచి, నాశనం చేసి, ఇప్పుడు ఇంట్లో పంచాయితీ పెట్టుకొని హెచ్ఎంఎస్‌తో పొత్తు అంటూ కల్లబొల్లి మాటలు చెబితే కార్మికులు నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో ఆల్బర్ట్, పీతాంబరరావు, రజాక్, లలిత, లక్ష్మి, అశోక్, సైమన్, శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, రాజమల్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు కృషి



జూలూరుపాడు: ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, పలువురు నాయకులు మాట్లాడుతూ.. నులి పురుగుల నిర్మూలనకు కృషి చేస్తున్నామని తెలిపారు. 1 – 19 ఏళ్ల వయస్సు గల వారంతా ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని, నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడుతారని చెప్పారు. శారీరక, మానసిక పెరుగుదల లోపిస్తుందని వివరించారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లుచ ఎంఈఓ జుంకీలాల్, సీఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ రవితో పాటు మనోజ్‌కుమార్, రామకృష్ణ, లక్ష్మీనర్సయ్య, లేళ్ల వెంకటరెడ్డి, మంగీలాల్‌నాయక్, మధుసూదన్‌రావు, రాంబాబు, వెంకటరామారావు, లచ్చునాయక్, నరసింహారావు పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్ మాట్లాడుతూ.. 9,527 మందికి ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, ఎంఈఓ శ్రీరామమూర్తి, జగన్నాధపురం వైద్యులు బి.రాజు, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, డాక్టర్ మధుబాబు, ఏపీఓ రంగా తదితరులు పాల్గొన్నారు. జగన్నాథపురం, ఉల్వనూరు పీహెచ్‌సీల పరిధిలో 14,581 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు.

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: కొమరారం, రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు లోహిత, కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైద్యాధికారి కందుల దినేశ్, హెచ్ఎం మోహన్‌రావు, వైద్య సిబ్బంది, నాయకులు వజ్జా పార్వతి, భూక్య దేవా, గుజ్జ విజయ, నాగుబండి వెంకటేశ్వర్లు, కోరం సురేందర్, బోడ మంగీలాల్, రెడ్యానాయక్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ రింగ్ ప్రారంభం



బాక్సింగ్ రింగ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంటౌన్: రైటర్‌బస్తీ సీఈఆర్ క్లబ్ ఇండోర్ హాల్‌లో బాక్సింగ్ రింగ్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. బాక్సింగ్ రింగ్ క్రీడాకారులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని, బాక్సింగ్‌లో శిక్షణ తీసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డిలతో పాటు బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు, క్రీడా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు వేయాల్సిందే



సూచనలు చేస్తున్న నోడల్ అధికారి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేస్ రికగ్నిజేషన్ సెంటర్‌ను ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తప్పనిసరిగా ఫేస్ రికగ్నిజేషన్ సెంటర్‌లో హాజరు వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు ఆధార్ కార్డు లింకు చేయించుకోవాలని సూచించారు. కళాశాలకు నిర్ణీత సమయంలో వచ్చి హాజరు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ కత్తి రమేశ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి



మాట్లాడుతున్న కమిషనర్ సుజాత

సుజాతనగర్: మండల కేంద్రంలో ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా మున్సిపల్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత ఆదేశించారు. మండల కేంద్రంలోని సైడ్ డ్రెయినేజీని సోమవారం ఆమె పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కింది భాగంలో ఓ వ్యక్తికి చెందిన భూమి ఉండటంతో కాల్వ ద్వారా నీరు వెళ్లకుండా చూస్తామని తెలిపారు. ఇకపై ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సుజాతనగర్ డివిజన్ కార్యాలయంలో ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని, ఆయా సమస్యలపై ప్రజలు అక్కడికి రావొచ్చని వెల్లడించారు.

కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

జూలూరుపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ కొత్త పెన్షన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని, వృద్ధులు, వితంతువులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెంచి ఇస్తామన్న హామీ నెరవేర్చాలని కోరారు.

పట్టాలు లేక రైతుల అవస్థ

- దశాబ్దాలుగా పట్టాల కోసం రైతుల ఎదురుచూపులు
- ఎరువులు, రుణాలకు నోచుకోని వైనం



పట్టాలు అందని టేకులపల్లి మండలం మూడుతండా రైతులు

టేకులపల్లి: దశాబ్దాలుగా తాత, తండ్రుల కాలం నుంచి సాగులో ఉన్న వారసత్వ భూములకు అధికారులు పట్టాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. టేకులపల్లి, మూడుతండా తదితర గ్రామాలకు చెందిన రైతులు టేకులపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వెనకాల సర్వే నంబర్ 630 నుంచి 660 మధ్యలో 30 ఎకరాల వారసత్వ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. మూడ్ కృష్ణ, మూడ్ భాస్కర్, మూడ్ హుస్సేన్, భూక్య లక్ష్మణ్, భూక్య భద్రం, మూడు కస్నా, మూడు భద్రు, మూడు రమేశ్, మూడు సల్ల, మూడు కృష్ణ, గుగులోత్ ఉమారాణి, మూడు కాంతి, భూక్య మాన్‌సింగ్, మూడు రాజ్‌కుమార్, మూడు కళావతితో పాటు మరికొందరు రైతులు సాగు చేస్తున్నారు. ఈ భూములు తాతల నుంచి వారికి వారసత్వంగా లభించాయి. 2012లో అప్పటి కలెక్టర్ పట్టాలు కూడా ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన కొత్త పట్టా భూములకు దరఖాస్తు చేసుకోగా మూడు సల్లకు ఎకరం 32 గుంటల భూమి ఉండగా కేవలం మూడు గుంటలకు పట్టా ఇచ్చారు. గుగులోత్ ఉమారాణికి రెండు ఎకరాలకు గాను 12 గుంటలకే పట్టా ఇచ్చారు. మిగిలిన వారికి ఎవరికీ పట్టాలు రాలేదు. వీరంతా భూమి శిస్తులు కూడా చెల్లించి ఉన్నారు. పహానీలు కూడా కలిగి ఉన్నారు. ఆనాటి నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోయారు. పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధు, రైతు బీమా, పీఎంకిసాన్‌లకు నోచుకోవడం లేదు. పట్టాలు లేకపోవడంతో ఎరువులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వ రుణాలు రాకపోవడంతో అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గత నెల 29న టేకులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినా నేటికీ సర్వేకు రాలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమ వారసత్వ భూములకు సర్వే నిర్వహించి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నాం..



మాకు మూడుతండా 650 సర్వే నంబర్‌లో ఎకరం 32 గుంటల భూమి ఉంది. 2012లో జిల్లా కలెక్టర్ పట్టా ఇచ్చారు. 2018లో పట్టాల కోసం దరఖాస్తు చేస్తే కేవలం 3 గుంటలకే పట్టా ఇచ్చారు. అనేకసార్లు దరఖాస్తులు పెట్టాము. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.

–మూడు సల్ల, రైతు

ఆరు ఎకరాలకు పట్టా రావాలి



634 సర్వే నంబర్‌లో మాకు ఆరున్నర ఎకరాల భూమి ఉంది. దశాబ్దాలుగా మేము సాగు చేసుకుంటున్నాం. శిస్తులు కట్టాం. పహానీలు కూడా ఉన్నాయి. పాత పట్టా కూడా ఉంది. కొత్త పట్టా కోసం దరఖాస్తు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు న్యాయం చేయాలి.

–మూడు వస్రాం, రైతు